

# నేడో, రేపో సాగర్ గేట్లు ఓపెన్

- శ్రీశైలం నుంచి భారీగా వరద
- 24గంటల్లో 15 అడుగులు పెరిగిన నీటి మట్టం
- అదనంగా 33 టీఎంసీలు రాక
- నేటి సాయంత్రానికి 580 అడుగులకు చేరుకోవచ్చని అంచనా

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వస్తున్న భారీ వరదతో నాగార్జునసాగర్ రిజర్వాయర్ వేగంగా నిండుతున్నది. 24 గంటల్లోనే 15 అడుగుల మేర నీటి మట్టం పెరగ్గా, అదనంగా 33 టీఎంసీల నీరు వచ్చి చేరింది. వరద ఉధృతి ఇలాగే కొనసాగే అవకాశాలు మెండుగా ఉండడంతో నేటి రాత్రికి గానీ, రేపు ఉదయానికి గానీ నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు తెరుచుకోనున్నాయి. ఇదే జరిగితే రెండేండ్ల తర్వాత సాగర్ గేట్లు ఎత్తినట్టు అవుతుంది. శనివారం సాయంత్రానికి కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి భారీగా వస్తున్నది. దాంతో శ్రీశైలం క్రస్ట్‌గేట్లలో 10 గేట్లను 20 అడుగల మేర పైకి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 4.94లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తున్నది. తద్వారా సాగర్ రిజర్వాయర్ వేగంగా నిండుతున్నది. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 565 అడుగులకు చేరుకోగా, మొత్తం నీటినిల్వ సామర్థ్యం 244.14 టీఎంసీలకు నీరు చేరుకుంది. గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 312 టీఎంసీలు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు మొత్తం 24 గంటల్లోనే 15 అడుగల మేర నీటిమట్టం పెరిగి 33 టీఎంసీల నీరు అదనంగా వచ్చి చేరింది. ఆదివారం కూడా ఇదేవిధంగా వరద కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో నేటి సాయంత్రానికి 575 అడుగుల పైకి పెరుగవచ్చని అంచనా. ఇప్పటికే సాగర్ నుంచి ఎడమ, కుడి కాల్వలు, ఏఎమ్మార్పీ, లోలెవల్ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తిని కూడా ప్రారంభించారు. వీటన్నింటి ద్వారా సాగర్ నుంచి అవుట్‌ఫ్లోగా 39,741 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తున్నది.

# ఏఎమ్మార్పీ నీటి విడుదల

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 3 : నాగార్జునసాగర్‌కు వరద పోటెత్తుతున్న నేపథ్యంలో ఏఎమ్మార్పీ నుంచి మూడు మోటార్ల ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతంలో రెండు మోటార్ల ద్వారా 600 క్యూసెక్కులు విడుదల చేయగా ప్రస్తుతం ప్రధాన కాల్వ డిస్ట్రిబ్యూటర్లకు నీటి విడుదల చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో శనివారం మరో మోటార్‌ను ప్రారంభించారు. పది రోజులుగా తాగునీటి అవసరాల కోసం 500 క్యూసెక్కులు ఉదయ సముద్రానికి విడుదల చేస్తుండగా, మరో 500 క్యూసెక్కులను శనివారం విడుదల చేశారు. ప్రస్తుతం ఏకేబీఆర్ నీటిమట్టం తగ్గడంతో మిగిలిన నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేస్తున్నారు. తాగునీటి కోసం డి-7తో పాటు మరికొన్ని డిస్ట్రిబ్యూటర్లకు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# డెంగ్యూ పంజా

## ఉమ్మడి జిల్లాలో విజృంభిస్తున్న మహమ్మారి

- ఇప్పటివరకు 240 కేసులు నమోదు
- ప్రైవేట్ ల్యాబ్‌ల లెక్కలు ఇందుకు అదనం
- జిల్లాలో కొనసాగుతున్న జ్వర సర్వేలు
- వైరల్ ఫీవర్స్‌తో ఆస్పత్రులకు జనం క్యూ
- టెస్టుల పేరుతో ప్రైవేట్‌లో అడ్డగోలు దోపిడీ
- 'ప్రత్యేక పాలన'లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్లు

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డెంగ్యూ పంజా విసురుతున్నది. వర్షాకాలంలో అవడం, పారిశుధ్య నిర్వహణ లోపించడంతో కేసులు విజృంభిస్తున్నాయి. పల్లె, పట్నం అనే తేడా లేకుండా రోజురోజుకు పెరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 240 కేసులు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తున్న కేసులు ఇందుకు అదనం.**

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ)



భువనగిరిలోని ఏరియా ఆసుపత్రిలో ఓపీ సేవల కోసం వచ్చిన రోగులు

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, టైపాయిడ్, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు చుట్టుముడుతున్నాయి. వైరల్ ఫీవర్లు పెద్దఎత్తున నమోదవుతున్నాయి. తాజాగా మలేరియా, డెంగ్యూ కేసులు పెరిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్ ఏరియా ఆస్పత్రులు, 21 పీహెచ్‌సీలు ఉన్నాయి. అన్ని చోట్లకూ రోగులు క్యూ కడుతున్నారు. జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాల సమస్యతో ఉదయం నుంచే తరలివస్తున్నారు. జిల్లా దవాఖానలో రోజూ 200 నుంచి 250 ఓపీ నమోదవుతున్నది.

### ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 240 డెంగీ కేసులు నమోదు కాగా, యాదాద్రి భువనగిరిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 14 కేసులు రికార్డ్ అయ్యాయి. యాదగిరిగిగుట్ట, పోచంపల్లి మండలాల్లో రెండు కేసులు తేలాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరిన్ని కేసులు నమోదైనట్లు తెలుస్తున్నది. ఎయిమ్స్‌లోనూ కేసులు భారీగా పెరుగుతున్నాయి. హైదరాబాద్ దగ్గరలో ఉండడంతో అనేకమంది నగర శివారులోని దవాఖానలకు వెళ్తున్నారు. గతేడాది జిల్లాలో 26 డెంగీ కేసులు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లాలో 166 డెంగ్యూ కేసులు వచ్చినట్లు నిర్ధారించారు. నల్లగొండలో 60 కేసులు రికార్డ్ అయ్యాయి.

### పల్లెల్లో జ్వర సర్వేలు..

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అధికార యంత్రాంగం ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటుచేసింది. ఈ బృందంలో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి, మలేరియా నియంత్రణ సహాయ అధికారి, ముగ్గురు సబ్ యూనిట్ ఆఫీసర్లు ఉన్నారు. వీరు ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నారు. ప్రస్తుతం కేసులు నమోదైన చోట జ్వర సర్వేలు నిర్వహిస్తున్నారు. కేసుల వచ్చిన చోట్ల చుట్టుపక్కల ఇండ్లను కూడా పూర్తిగా పరీక్షిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 13వేల ఇండ్లలో జర్వ సర్వే చేశారు.





### పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. వారంతా వారి శాఖలకు సంబంధించిన రోజువారీ విధులను నిర్వహిస్తూనే ఆయా మండలాలు, గ్రామాల బాధ్యతలను అదనంగా చూస్తున్నారు. దాంతో పారిశుద్ధ్యంపై సరైన ఫోకస్ పెట్టడం లేదని తెలుస్తున్నది. ఫలితంగా గ్రామాలు, పట్టణాల్లో చెత్తచెదారం పేరుకుపోతున్నది. డ్రైనేజీలు పేరుకుపోతున్నాయి. పందులు, వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు కూడా కనిపించడం లేదు. ఫాగింగ్ మొక్కుబడిగా చేస్తున్నారు.

### ప్రైవేట్ దవాఖానల్లో దోపిడీ..

సీజనల్ వ్యాధులను ఆసరా చేసుకుని ప్రైవేట్ హాస్పిటళ్లు, ల్యాబ్‌లు రోగులను అందినకాడికి దోచుకుంటున్నాయి. అవసరం లేకున్నా అడ్డగోలుగా పరీక్షలు చేస్తున్నాయి. ల్యాబ్‌ల్లో రిపోర్టులు కూడా సరిగ్గా రావడం లేదని రోగులు వాపోతున్నారు. ప్లేట్‌లెట్లు తక్కువగా ఉన్నా డెంగ్యూ అంటూ భయపెడుతున్నారని చెప్తున్నారు. చాలావరకు ల్యాబ్‌ల్లో ఎలీసా టెస్టులు చేయకుండానే డెంగ్యూ అని నిర్ధారిస్తున్నారు. మరోవైపు వైద్యాధికారుల పర్యవేక్షణ కూడా ఉండడం లేదు.

### జనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమ తెరలను వాడాలి.
- శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలి.
- వారానికోసారి నీటి తొట్లు, ఇతర పాత్రలను శుభ్రంగా కడిగి, తుడిచి నీరు నింపుకోవాలి.
- ఇంటి లోపల, బయట పనికిరాని చెత్తను ఉంచకుండా చూసుకోవాలి.
- నీళ్ల ట్యాంకులు, డ్రమ్ములు, మంచి నీటి పాత్రలపై మూతలు పెట్టాలి.
- ఉదయం, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల సమయంలో తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.



### అనుమానం వస్తే పరీక్షలు చేయించుకోవాలి

వైరల్ ఫీవర్లు అన్నీ డెంగ్యూ కాదు. భయపడాల్సిన అవసరం లేదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. దోమతెరలు వాడాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వెంటనే పరీక్షలు చేస్తున్నాం. తద్వారా రోగి త్వరగా కోలుకునేందుకు ఆస్కారం ఉంటుంది. డెంగ్యూ లక్షణాలు, అనుమానం ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లో ఆలస్యం చేయొద్దు.

- డాక్టర్ అర్జున్ రాజ్, మైక్రోబయాలజిస్ట్



నల్లగొండ ఉమెన్స్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

# ప్రభుత్వ విద్యకు ప్రోత్సాహం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి
- నల్లగొండలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- కంచనపల్లి వద్ద డీ-39 కాల్వకు నీటి విడుదల

నల్లగొండ, ఆగస్టు 3 : రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ విద్యను ప్రోత్సహించి దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్‌గా నిలుపుతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉమెన్స్ కళాశాలలో అదనపు భవనం, మున్సిపాలిటీలో కౌన్సిల్ హాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కంచనపల్లిలో డీ-37 కాల్వకు నీటి విడుదల చేశారు. జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించారు. అంతకుముందు ఉదయం క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో ముందుకు వెళ్లాలన్నారు. డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగ వేటలో పడాలని సూచించారు. యువతకు ఉపయోగపడేలా జిల్లా కేంద్రంలో రూ.20లక్షలతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని నిర్మించి, హైదరాబాద్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ వద్ద రూ.80కోట్లతో బహుళ వసతి గృహం ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు మంచి వసతి కల్పిస్తామని ప్రకటించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ సిబ్బంది పారిశుధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఏఎమ్మార్పీ ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతోనే ఎడమ కాల్వ తర్వాత ఆ కాల్వలకు కూడా నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కనగల్ మండలం రేగట్టె గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, అదనపు కలెక్టర్ పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, కాంగ్రెస్ నేత గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





సీహెచ్ ప్రియాంక

## అదనపు కలెక్టర్ ప్రియాంక బదిలీ

సూర్యాపేట, ఆగస్టు 3 : సూర్యాపేట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ డిప్యూటీ కమిషనర్‌గా ఆమెను బదిలీ చేసింది. 2018 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన ప్రియాంక 2023 జూలై 27న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. సంవత్సరంపాటు జిల్లాలో విధులు నిర్వహించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో చురుగ్గా పని చేశారు. కిందిస్థాయి ఉద్యోగులు, అధికారులతో ఫ్రెండ్లీ ఆఫీసర్‌గా పేరు సంపాదించుకున్నారు.

# సాగర్ నీరు చెరువులకే..

**ప్రస్తుతం పంటల సాగుకు మళ్లించొద్దు : కలెక్టర్ నారాయణరెడ్డి**

నల్లగొండ, ఆగస్టు 3 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నీటితో జిల్లాలోని చెరువులు నింపాలని ప్రభుత్వం నిర్ణయించినందున రైతులు ఆ నీటిని సాగు అవసరాలకు మళ్లించొద్దని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎడమ కాల్వకు రోజూ పది వేల నుంచి పదకొండు వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపిన కలెక్టర్.. ఆ నీటితో జిల్లాలోని చెరువులను మాత్రమే నింపనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యక్షిస్తుండాలని ఆదేశించారు. ఎక్కడైనా చెరువు కట్టలు తెగే ప్రమాదం ఉంటే వెంటనే పైఅధికారులకు సమాచారం అందించాన్నారు. ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి లష్కర్లను కాల్వల వెంట తిప్పి నీటి దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యాచరణ అమలుకు జిల్లావ్యాప్తంగా ఉన్న తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు. త్వరలో పంటల సాగుకు సైతం నీటిని విడుదల ఉంటుందని, ప్రస్తుతం వదిలిన నీటిని చెరువుల మాత్రమే వదలామని స్పష్టం చేశారు.



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

# బీసీ ఫైల్స్‌కు పాతర

- పాత కలెక్టరేట్‌లోనే వదిలేసిన అధికారులు
- సూర్యాపేటలో బీసీ సంక్షేమ శాఖ నిర్లక్ష్యం



పాత కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో వదిలి వెళ్లిన దరఖాస్తులు, ఫైల్స్



సూర్యాపేట, ఆగస్టు 3 : జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. కలెక్టరేట్‌లోని కార్యాలయాలన్నీ కొత్త భవనంలోకి వచ్చి ఏడాది అవుతున్నా బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ ఫైళ్లు, ఉపాధి కోసం పెట్టుకున్న దరఖాస్తులు, స్వయం ఉపాధి రుణాల కోసం వచ్చిన అర్జీలను పాత కార్యాలయంలోనే వదిలేశారు. వాటికి సంబంధించిన వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రతి దరఖాస్తునూ జాగ్రత్తగా భద్రపరచాల్సిన అధికారులు గాలికి వదిలేయడం విస్మయం గొల్పుతున్నది. ఈ విషయమై బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనసూయను వివరణ కోరగా.. తాను ఆ సమయంలో అనారోగ్య సమస్యలతో సెలవులో ఉన్నానని తెలిపారు. నెల రోజుల క్రితమే విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు.

# జాబ్ క్యాలెండర్‌పై భగ్గుమన్న నిరుద్యోగులు

- బూటకపు ప్రకటనలపై మండిపాటు
- బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

మిర్యాలగూడ, ఆగస్టు 3 : అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు బూటకపు జాబ్ క్యాలెండర్ విడుదల చేశాడని నిరుద్యోగులు భగ్గుమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అసంపూర్తి జాబ్ క్యాలెండర్‌ను నిరసిస్తూ శనివారం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మిర్యాలగూడలో చేపట్టిన ఆందోళనలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్ మాట్లాడుతూ పోస్టులు, నోటిఫికేషన్, పరీక్ష తేదీలు లేకుండా అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగాల పేరిట తెలంగాణ యువతను మోసం చేసిన రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌కు మొదటి క్యాబినేట్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు నిరుద్యోగులను మోసం చేశాడని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ మిర్యాలగూడ మండలాధ్యక్షుడు అంజియాదవ్, నాయకులు దస్రూనాయక్, కిరణ్, మల్లేశ్, మహేశ్, శివనాయక్ పాల్గొన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట, అడ్డగూడూరులోనూ బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.



మిర్యాలగూడలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

# కుల గణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

- కలెక్టరేట్ ఎదుట బీసీ సంక్షేమ సంఘం ధర్నా

నల్లగొండ రూరల్, ఆగస్టు 3 : కుల గణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ ధర్నాకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే బీసీల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, నాయకులు పర్వతాలు, ప్రసన్న, సతీశ్, శ్రీనివాస్, కోటేశ్, వేణు, సదానంద, దుర్గ, నాగరాజుగౌడ్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు